అందరికీ అందుబాటులో ఉంటా

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: తనపై నమ్మకం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సరూర్‌నగర్ డివిజన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డివిజన్ నుంచి తన గెలుపు కోసం అత్యధిక మెజారిటీని ఇచ్చిన ప్రజలను ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటానని అన్నారు. నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో చేసిన అభివృద్ధి పనులే మెజారిటీ రావడానికి కారణమైందన్నారు. డివిజన్‌లో ప్రజా సమస్యలపై అవసరం అనుకుంటే అసెంబ్లీలో కూడా చర్చిస్తానన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యకర్తలకు, ప్రజలకు ఏ ఆపద వచ్చినా ముందుండి పోరాడుతానని అన్నారు. నియోజకవర్గంలో ఎంతో కష్టపడి ఫార్మాసిటీ తీసుకొస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కారణాలు చూపకుండా రద్దు చేసిందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే అనేక ప్రాజెక్టులను తీసుకొచ్చానని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, డివిజన్ మాజీ అధ్యక్షుడు అంకిరెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారి సరూర్‌నగర్ డివిజన్‌కు వచ్చిన సందర్భంగా డాక్టర్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం సబితారెడ్డిని ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావు, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్, దయాకర్, చంద్రయ్య ఉన్నారు. అనంతరం బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు ఎండి.సలీం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సబితారెడ్డి ఆవిష్కరించారు.

క్లుప్తంగా

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌తో ఎమ్మెల్యే సబితారెడ్డి, సంఘం ప్రతినిధులు

కందుకూరు: తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆవిష్కరించారు. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే నివాసంలో కలిసి క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జనరల్ సెక్రటరీ జంగారెడ్డి, కోశాధికారి వెంకటేశ్వర్లు గుప్తా, ఆర్గనైజేషన్ సెక్రటరీ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

ఏకలవ్య విగ్రహావిష్కరణ



చందన చెరువు కట్టపై ఏకలవ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై నూతనంగా ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహాన్ని ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు భూపాల్‌రెడ్డి, లావణ్య, మమత, పద్మ, ఎరుకల సంఘం నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, రఘు, నాగయ్య పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి



క్రీడాకారులతో ఎస్‌ఐ శ్రీశైలం, అతిథులు

యాచారం: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని ఎస్‌ఐ శ్రీశైలం పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యాచారం మండలం చౌదర్‌పల్లిలో సీపీఎల్-2 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎస్‌ఐ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చౌదర్‌పల్లి గ్రామం అంటేనే ఉద్యోగాల ఖిల్లాగా పేరొందిందని అన్నారు. గ్రామంలో మొదటి నుంచి ఎంతో మంది ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామంలోని యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని అన్నారు. సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహ, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతల వితరణ

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు



అక్షింతల వితరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

కందుకూరు: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాలకు అక్షింతల వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం మండల కేంద్రంలోని సీతారామశాస్త్రి ఫంక్షన్‌హాల్‌లో వేద పండితుడు రెవెల్ల రాజుశర్మ సమక్షంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రతినిధులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ మహేశ్వరం జిల్లా ప్రచారక్ ఆంజనేయులు మాట్లాడుతూ.. 500 ఏళ్ల నిరీక్షణ తర్వాత అయోధ్య రామాలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరగనుండటం గొప్ప విషయమన్నారు. జనవరి 22న హిందువులందరూ దీపావళి పండుగలా జరుపుకోవాలని కోరారు. శ్రీరాముడి అక్షింతలు ప్రతి హిందువు కుటుంబానికి చేరేలా గ్రామ సంయోజక్‌లు, హిందుమిత్రులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సంయోజక్ కందడి శ్రీరామ్, ఆర్‌ఎస్‌ఎస్ కందుకూరు ఖండ కార్యనిర్వాహక శ్రీకాంత్, సహ కార్యనిర్వాహక గౌర విష్ణు, మనోహర్, సురేష్, ఢిల్లీ అనిల్, సాయి, ప్రవీణ్‌గౌడ్, గిరిబాబు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం

పహాడీషరీఫ్: వంద మంది కానిస్టేబుళ్లతో సమానంగా ఒక్క సీసీ కెమెరా పని చేస్తుందని బాలాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి అన్నారు. స్టేషన్ పరిధిలో 12 కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నివారణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఎక్కడైనా దొంగతనాలు జరిగినా నేరస్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో డీఐ మధు, ఎస్సైలు జానీ, మహేందర్, సైదులు, సీఎస్ రెడ్డి కాలనీ అధ్యక్షుడు పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేదునూరు మాజీ సర్పంచ్ మృతి

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు మాజీ సర్పంచ్ బద్దుల మల్లయ్య(62) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన భార్య మూడేళ్ల క్రితమే మృతి చెందింది. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సీపీఎం పార్టీ సహకారంతో 2006లో ఆయన సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన మృతదేహానికి సీపీఎం నాయకులతో పాటు వివిధ పార్టీల నేతలు, గ్రామస్తులు నివాళులర్పించారు.

వృద్ధుడి అదృశ్యం



శ్రీనివాస్ (ఫైల్)

కందుకూరు: ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ వారాసిగూడకు చెందిన ఏడుకొండల శ్రీనివాస్(63) మండల పరిధిలోని చిప్పలపల్లి సమీపం ప్రకృతి కుటీర్ ఆశ్రమం ఏర్పాటు చేసుకుని యోగా గురువుగా 15 ఏళ్ల నుంచి అక్కడే నివసిస్తున్నారు. కాగా ఈ నెల 27న వారాసిగూడలోని కూతురు ఐశ్వర్యలక్ష్మి వద్దకు సాయంత్రం వస్తానని ఫోన్ ద్వారా తెలిపారు. అదే రోజు రాత్రి ఆయనకి కూతురు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి



డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని, పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన భట్టికి వివరించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి తగిన గౌరవం ఇస్తామని భట్టి కేఎల్లార్‌కు భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుపొందే విధంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గౌరి సతీష్, మర్రి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత: కార్పొరేటర్



కాలనీలో చెత్తను తొలగిస్తున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తను కాలనీవాసులతో కలిసి తొలగించారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్యగౌడ్, మెట్టుపల్లి సంతోష్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు శ్రీశైలం, బాలు నాయక్, రవి, సాంబయ్య, సోమయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రామ మందిర అక్షింతల ఊరేగింపు



ఇబ్రహీంపట్నం రూరల్: అక్షింతలు తీసుకుంటున్న మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

తుర్కయంజాల్: శ్రీరాముడి దివ్య అక్షింతలు ప్రతి ఒక్కరికి అందేలా సహకరించాలని యంజాల్ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ బొక్క రవీందర్ రెడ్డి, బీజేపీ నేత కొంద్రు పురుషోత్తం అన్నారు. అయోధ్యలోని రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలకు ఆదివారం గ్రామంలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ప్రతి కాలనీ సంక్షేమ సంఘాల నుంచి ఇంటింటికి అక్షింతలను పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వంశీధర్ రెడ్డి, బీజేపీ యువజన విభాగం నాయకులు కార్తీక్ గౌడ్, ప్రేమ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపటేల్‌గూడలో శోభాయాత్ర..

ఇబ్రహీంపట్నం రూరల్: రామ మందిరం ప్రారంభోత్సవానికి ప్రజలు భారీగా తరలిరావాలని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటిలోని ఎంపీపటేల్‌గూడలో అయోధ్య రామయ్య అక్షింతలు శోభాయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు . జనవరి 22న అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధికార ప్రతినిధి డాక్టర్ శశిధర్, బీజేపీ జిల్లా కార్యదర్శి పొట్టి రాములు, బిట్ల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మల్లేశ్వరి, శ్రీశైలం పాల్గొన్నారు.

మూడు రోజుల్లో భారీగా దరఖాస్తులు

- ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో 'ప్రజాపాలన' కు విశేష స్పందన
- అత్యధికంగా కాప్రా సర్కిల్‌లో 37,358 దరఖాస్తులు



అభయ హస్తం దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు (ఫైల్)

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గత మూడు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పథకాల (అభయ హస్తం) కోసం దరఖాస్తు చేసేందుకు ప్రజలు పోటెత్తారు. ఎల్బీనగర్ జోనల్ పరిధిలో శనివారం సుమారు 52,999 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం, సోమవారం సెలవు కావడంతో తిరిగి ఈ పథకానికి మంగళవారం నుంచి ఆయా కేంద్రాల వద్ద దరఖాస్తులు స్వీకరిస్తారని అధికారులు చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమం మొదటి రోజు 31,332 మంది, రెండో రోజు 49,882, మూడో రోజు 52,999 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. అత్యధికంగా, కాప్రా సర్కిల్‌లో 37,358 మంది దరఖాస్తులు చేసుకోగా, అత్యల్పంగా ఎల్‌బీనగర్ సర్కిల్-4లో 19,754 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఈ అభయ హస్తం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో 92 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా జనం రద్దీ ఏర్పడకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. దరఖాస్తుల కోసం వచ్చే వారి కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసు బందోబస్తును సైతం ఉంచారు.

సర్కిళ్ల వారీగా వచ్చిన దరఖాస్తులు

- కాప్రా సర్కిల్ పరిధిలో 37,358
- ఉప్పల్ సర్కిల్ పరిధిలో 26,266
- ఎల్‌బీనగర సర్కిల్-3లో 27,320
- ఎల్‌బీనగర్ సర్కిల్-4లో 19.754
- ఎల్‌బీనగర్ సర్కిల్-5లో 23.515

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



విజేతలకు చెక్కు, ట్రోఫీ అందజేసిన అతిథులు

నాగర్‌కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఐక్యతా ఫౌండేషన్ ప్రోత్సాహం అందిస్తుందని నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో వారంరోజులుగా నిర్వహిస్తున్న ఎంపీఎల్-3 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, ఎస్‌ఐ బల్‌రాం హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి గెలుచుకున్న ఛత్రపతి శివాజీ టీంకు రూ.25వేలు నగదు, ట్రోఫీ, రెండవ బహుమతి గెలుచుకున్న వివేకానంద టీంకు రూ.15వేలు, ట్రోఫీని అందించారు. వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాపోటీల నిర్వహణకు, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబర్‌సింగ్, ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాములు, నాయకులు శ్రీరాములు, పరమేశ్, కిషన్, శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సత్కారం



ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న జయరాంనాయక్

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కందుకూరు ఎంపీడీఓ వెంకట్రాములు, ఆమనగల్లు మండల పరిషత్ సూపరింటెండెంట్ రమేశ్‌నాయక్, ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు సోన జయరాం సత్కరించారు. నాయకులు బాబా, విజయ్‌రాథోడ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ..

తలకొండపల్లి: మండల పరిధిలోని ఖానాపూర్ ఎంపీటీసీ సరిత గణేశ్‌గుప్త అత్త ఆదివారం హైదరాబాద్‌లోని శ్రీకర్ హాస్పిటల్‌లో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి నివాళులు అర్పించారు. నాయకులు కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, గోలి సురేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు.